క్లుప్తంగా

దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: శనివారపుపేట పరివర్తన బదిరుల పాఠశాల విద్యార్థులకు గురువారం ఏలూరుకు చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అసోసియేషన్ ప్రతినిధి ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ సభ్యుల సహకారంతో ప్రతినెలా వృద్ధాశ్రమం, అనాథ పిల్లలకు భోజనం ఏర్పాటుతో పాటు పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సాయి అరవింద్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు.

త్రీటౌన్ సీఐగా వెంకటేశ్వరరావు



ఏలూరు టౌన్: త్రీటౌన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పని చేస్తామని ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వరరావు ఎస్సైగా పోలీసు శాఖలో ఉద్యోగం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణలో కొంతకాలం ఉద్యోగం నిర్వహించిన అనంతరం పాలకోడేరు, చేబ్రోలు, ఉండి, ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలోఆయన ఎస్సైగా పని చేశారు. 2016 సంవత్సరంలో సీఐగా పదోన్నతి పొందారు. అనంతరం ఆయన విజయవాడ ఇంటెలిజెన్స్, గణపవరం పోలీస్ స్టేషన్లలో సీఐగా పని చేశారు. భీమడోలు సీఐగా పనిచేస్తూ ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్రీటౌన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నేరాల అదుపునకు పటిష్టమైన చర్యలు చేపడతామని చెప్పారు. నేరాలకు పాల్పడే వారిపై నిత్యం నిఘా ఉంటుందని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు చట్టానికి లోబడి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

భోజనశాలకు శంకుస్థాపన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తూర్పువీధి రామమందిర ప్రాంగణంలో భోజనశాల భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు జీఎస్‌ఆర్ చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. మందిర ప్రాంగణంలోని శివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చౌదరిని సన్మానించారు. భోజన శాల నిర్మాణానికి సహకరించిన చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మద్దుల సత్యకుమార్, మాడ సుబ్బారావు, కనిగొళ్ల రాజేష్, ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్, మద్దుల వంశీకృష్ణ, మడుపల్లి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి అవిరళ కృషి చేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా బ్రహ్మరథం పట్టేందుకే సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 55వ సచివాలయం పరిధిలో 7వ డివిజన్‌లో, టూటౌన్ 20వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు చేపట్టారు. నిత్యం చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కార్యకర్తల్లో జోష్ నింపుతోంది.

ఏలూరు వన్‌టౌన్ 7వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, క్లస్టర్–1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం సంక్షేమ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అండగా ఉంటూ అనేక పథకాలను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా మహిళలను రుణమాఫీ పేరుతో మోసం చేశారని ఆరోపించారు. సీఎం జగనన్న గత నాలుగున్నరేళ్లుగా హామీలన్నీ అమలు చేస్తూ రుణమాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాధ, విజయ్, నాయకులు భగవాన్, గోపి, పార్టీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఏలూరు టూటౌన్ మినీబైపాస్‌లోని సచివాలయం వద్ద 20వ డివిజన్‌కు సంబంధించి జగనన్నే మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు జీహెచ్‌డీ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. సంక్షేమ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ఉపాధి కల్పన కోసం చేయూత, ఆసరా పథకాల ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, పార్టీ నాయకులు భట్టు విజయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులున్నారు.



ఏలూరు 7వ డివిజన్‌లో పార్టీ జెండా ఎగురువేస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



ఏలూరు 20వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ప్రారంభించిన డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్

మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వరలక్ష్మి

ఏలూరు టౌన్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈనేపథ్యంలో ఏలూరు నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ దాసరి వరలక్ష్మి పార్టీ మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీగా నియమితులయ్యారు. ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు అభ్యర్థుల గెలుపునకు తమ వంతు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు రైతు సహకార చైతన్య బ్యాంకు అధ్యక్షుడు దాసరి రమేష్ ఉన్నారు.



ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరలక్ష్మి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



వెంకటాపురంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట దిగుబడిని పరిశీలిస్తున్న ఎంఏఓ జీవనసంధ్య

ఏలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో ఆశించిన దిగుబడి సాధించవచ్చని ఏలూరు మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య అన్నారు. గురువారం వెంకటాపురంలో ప్రకృతి వ్యవసాయం క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు స్వయంగా అవగాహన కల్పించేందుకు ప్రకృతి వ్యవసాయశాఖ మండల యూనిట్ ఇన్‌చార్జి కొండిశెట్టి వెంకటలక్ష్మి తన ఎకరం పొలంలో ప్రకృతి సాగు చేపట్టిందని తెలిపారు. కంపాక్ట బ్లాక్ వన్ ఇన్‌టూ వన్ పద్ధతిలో (ఎటుచూసినా అడుగుదూరంలో) 1318 వరి రకం నాట్లు వేసిందన్నారు. ఈ విధానం వల్ల దిగుబడి పెరగడంతో పాటు తెగుళ్లు సోకే అవకాశం తగ్గిందన్నారు. ఈ ప్రయోగం వల్ల ఎకరానికి 41 బస్తాలు దిగుబడి వస్తుందని చెప్పారు. ఈ సాగు విధానం ప్రత్యక్షంగా చేసి చూపడం వల్ల మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో చోరి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని బావిశెట్టి వారిపేటలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. ఆలయం గేటు తాళాలు పగులగొట్టి లోనికి చొరపడ్డారు. హుండీ పగలగొట్టి హుండీలోని నగదు, కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ఉంచిన నగదును అపహరించుకుపోయారు. ఆలయ అర్చకుడు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ పోలీసులు సుబ్రహ్మణ్యేశ్వరి స్వామి ఆలయంలో వేలిముద్రలను సేకరించారు. చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు.



ఆలయంలో విచారణ చేస్తున్న క్లూస్ టీమ్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకృష్ణాపురం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, విజయ గార్డెన్స్, నెహ్రూ కాలనీ, గులాబితోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తంగెళ్లమూడి సెక్షన్ పరిధిలో..

ఏలూరు రూరల్ : విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం ఎంఆర్‌సీకాలనీ, ఎస్‌ఎంఆర్ నగర్, స్టేషన్‌రోడ్డు ఆదివారపుపేట, లక్ష్మీవారపుపేట, ఏటిగట్టు స్టేషన్‌రోడ్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీదే

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదవేగి : గత పాలకులు పెదవేగి మండలం దుగ్గిరాలలో ఇంటి స్థలం ఇమ్మంటే, చెరువులో పోరంబోకుల్లో ఇచ్చారని, నేడు పొలం కొని ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దుక్కుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన దుగ్గిరాలలో ప్రజా ఆశీర్వాద యాత్రను ప్రారంభించారు. దుగ్గిరాల, పినకడిమి, కొప్పాక మీదుగా యాత్ర సాగింది. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ తొలి విడత 100 కిలోమీటర్లు, దాదాపు 23 గ్రామాలు తిరిగి, రాత్రి గ్రామాల్లో బస చేయస్తానని, ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితవాడలో సీసీ రోడ్లు వేయించామని, దుగ్గిరాల నుంచి సత్రంపాడు వెళ్లే రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. సచివాలయం, నాడు – నేడు పథకంలో పాఠశాల రూపురేఖలు మార్చామని, దళితవాడ జోసెఫ్ నగర్‌లో కమ్యూనిటీహాల్, దళితవాడలో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేసే ఓటు అడగడానికి వస్తానని ఎమ్మెల్యే అన్నారు. రాయికుంట చెరువులో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



దుగ్గిరాల ప్రధాన కూడలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

జగన్ స్ఫూర్తితో యాత్ర

కార్యక్రమంలో పాల్గొన్న గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, పుప్పుల వాసుబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేపట్టిన పాదయాత్రకు అనూహ్య స్పందన లభించిందన్నారు. ఆయనకు 2024 ఎన్నికల్లో సుమారు 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు మాటలు చెప్పే ముఖ్యమంత్రి కాదని, చేతలతో అభివృద్ధి చేసి చూపిన ముఖ్యమంత్రి మనకు ఉన్నారని ప్రజలకు వివరించారు. పాదయాత్ర చేస్తున్న అబ్బయ్యచౌదరికి హృదయపూర్వక ఆశీస్సులు అందిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఆశీస్సులతో దెందులూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించి ప్రజల ఆశీర్వాదం పొందేందుకే ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	72	చిక్కుడు కాయలు	88
వంకాయలు (కాంతులు)	68	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10–12
బెండకాయలు	60	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	40
కాకర కాయలు	40	కీరా దోస	40
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	68	అల్లం	120
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	40–50	పాలకూర	12
దొండకాయలు	58	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	40–50	గోంగూర	08
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	44–58	బఠాణి	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	25	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్‌ఈఎల్	22.15	4822	25
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

సక్షమ్ క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్) : దివ్యాంగుల కోసం పనిచేస్తోన్న అఖిల భారత సంస్థ సక్షమ్ 2024 క్యాలెండర్‌ను తపన ఫౌండేషన్ చైర్మన్ జీఎస్ ఆర్ చౌదరి గురువారం విడుదల చేశారు. స్థానిక తపన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి పి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. ఆశలు గురువారం 36 గంటల సమ్మె చేపట్టారు. ముందుగా జూట్‌మిల్లు సెంటర్ నుం కలెక్టరేట్‌కు ప్రదర్శన నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేధింపులు ఆపాలని వారు నినదించారు. ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ సాబ్జీ, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడారు. సీఐటీయూ, సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారుడు జూపూడి మృతి

ఏలూరు రూరల్: ఏలూరుకు చెందిన వెటరన్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు జూపూడి ప్రసాద్ (73)మృతి చెందారు. కొంతకాలంగా డయాబెటిస్‌తో బాధపడుతూ గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక గ్రీన్‌సిటీలోని తన నివాసం వద్ద మృతి చెందారు. తొలుత ఫుట్‌బాల్ గోల్‌కీపర్‌గా రాణించిన ఆయన తర్వాత బాస్కెట్ బాల్ క్రీడాకారుడుగా నిలదొక్కుకున్నారు. 1970, 1980లో తన ఆటతీరుతో అందరినీ అలరించారు. ఏలూరులో జ్యూట్‌మిల్లులో టెక్నీషియన్‌గా పని చేశారు. ఆయన మృతికి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల్ని పంపించండి

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయని, తమ పిల్లలను విధిగా పంపాలని స్థానిక ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తల్లులను కోరారు. భీమడోలు–1 ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది సమ్మె చేస్తుండడంతో మూసి ఉంది. అయితే కొందరు అంగన్‌వాడీ చిన్నారులకు పాఠశాలలో ఉంచి వారికి విద్యాబుద్ధులు నేర్పించి వారికి పోషకాహారం అందించారు. గురువారం ఎంపీడీఓ పాఠశాలను ఆకస్మిక సందర్శించారు. సచివాలయ ఉద్యోగులకు ఈ కేంద్రాల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. ఈనెల 15 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు పని చేస్తాయన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది కేంద్రాలను నిర్వహించి చిన్నారులకు పోషకాహారం అందిస్తారని చెప్పారు. ఆ కేంద్రాలను ఏపీఎం పర్యవేక్షిస్తారని తెలిపారు. భీమడోలు మండలంలోని 64 అంగన్‌వాడీ కేంద్రాలన్నీ పని చేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రఘు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



భీమడోలులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పద్మావతిదేవి

అంగన్‌వాడీల నిరసన

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె గురువారం మూడో రోజూ కొనసాగింది. కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై నిలుచుని తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. సమ్మెకు పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. సమ్మె శిబిరాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ సందర్శించి సంఘీభావం తెలిపారు.

నేడు వరుడు కానున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయం షష్టి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 15 నుంచి 21 వరకు స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు గురువారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన మద్దుల శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

టవర్ ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: మండలంలోని దోసపాడు గ్రామంలో పరిశుద్ధ నిత్యసహాయమాత టవర్ ఉత్సవాలు గురువారం పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పి.డేవిడ్‌రాజు ప్రారంభించారు. తొలుత టవర్ వద్ద జెండా ప్రతిష్ట కార్యక్రమం ఆయన నిర్వహించారు. అనంతరం దోసపాడు ఆర్‌సీఎం చర్చిలో దివ్యపూజాబలి అర్పించారు. టవర్ ఉత్సవాల విశిష్టతను వివరించారు. 15, 16 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఫాదర్ తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం సీపీఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు మాట్లాడారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, రాయంకుల లక్ష్మణరావు, దొంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.